
# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 11 ఆగస్టు 2025 | పేజీలు 8


నాలాపైనే అక్రమ నిర్మాణం ఉన్నట్టు ఆధారం..



- మూసీనదిని కలిపే నాలాకు ముప్పు..! అప్రమత్తం కాకపోతే అంతే సంగతులు..
- ఫాక్స్‌సాగర్ చెరువుపై కబ్జాదారుల కన్ను..!చెరువు నీటిని ఖాళీచేసే ప్రక్రియ షురూ..!
- ఫాక్స్‌సాగర్ చారిత్రక నాలాపై ఒకేచోట మూడు ఆక్రమణలు..!
- "తిరుమల హైట్స్"-మార్వాడి షాపింగ్ కాంప్లెక్స్-జేకేనగర్‌లో కబ్జాలు..
- అక్రమ నిర్మాణాలకు లంచావతారుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు..!
- ప్రతిపాదనలు పెట్టేది, సైట్ వెరిఫికేషన్ ఏఈ స్థాయిలో..? ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేది కాంట్రాక్టర్..
- ఫాక్స్‌సాగర్ నాలాపై బిల్డర్ శ్రీధర్ అక్రమ కట్టడానికి ప్రైవేటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..
- నాలాల ఆక్రమణలను పరోక్ష పద్ధతిలో క్రమబద్ధీకరిస్తున్న "విద్యుత్" అధికారులు..

ఈనాలాపైనే బిల్డర్ శ్రీధర్ పూర్తి చేసిన నిర్మాణం ఇక్కడే ప్రారంభపు.. ఫైల్‌ఫోటో..



# కబ్జాల ఊబిలో..!

# చారిత్రక వారసత్వ సంపద

ఫాక్స్‌సాగర్ నాలా చారిత్రక వారసత్వ సంపదను కబ్జాదారుల చేతుల్లో పెట్టి..! కొందరు అవినీతి అధికారుల కరెప్షన్‌కి అడ్డూ అదుపు లేకుండా పోతోంది..! 125 ఏళ్ళనాటి చారిత్రక ఆనవాళ్ళను, ఏడాదికి ఏడాది నామ రూపాలు లేకుండా ఆ దిశగా కనుమరుగు చేస్తున్నారు.. 1897-99 కాలంలో నిర్మితమైన ఈ ఫాక్స్‌సాగర్ చెరువు నాలా, ఒకప్పుడు 200 ఫీట్ల వెడల్పుతో, మూసీనదిని కలిపే అతిపెద్ద నాలాగా ఉండేదని జీడిమెట్ల గ్రామస్థులు చెబుతుండగా..! ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసి జాయింట్ సర్వేతో, 2018లో 100 ఫీట్లకు కుదించారు..! ప్రస్తుతం సంబంధిత ఫాక్స్‌సాగర్ నాలా కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, ప్రాంతంలో పలుచోట్ల భారీ అక్రమ కట్టడాలతో ఆక్రమణకు గురైంది.. ఇదంతా అధికారుల ధనార్జనకు నిదర్శనం.. రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారుల సమన్వయంతో, ప్రజల ఆస్తులను అక్రమార్కులకు అప్పగిస్తున్నారు.. ఈమూడు శాఖలకు తోడుగా విద్యుత్ శాఖ కూడా వక్రమార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి సహకరిస్తున్నట్టు సమాచారం.


మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 10:

-2లో

అవినీతి అధికారుల చేతుల్లో కుంచించుకు పోతున్న ఫాక్స్‌సాగర్ నాలా..?




ఫాక్స్‌సాగర్ నాలాపైనే ఈ అక్రమ నిర్మాణం..



నాలాపై అక్రమ నిర్మాణానికి విద్యుత్ అధికారులు, అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..

- కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధి, సుచిత్రా రోడ్డులో ఈ కబ్జాల పర్వం..
- ప్రధాన సూత్రదారులుగా "నీటిపారుదల శాఖ, రెవెన్యూ, జీహెచ్ఎంసి సర్కిల్-25..
- ఫాక్స్‌సాగర్ నాలా బహిరంగ కబ్జాల వెనుక ప్రముఖ ప్రజాప్రతినిధి హస్తం..?
- పనికిమాలిన ఓ నేత నిర్వాకం..! అంతరించి పోతున్న ప్రభుత్వ భూములు, చెరువులు..
- నియోజకవర్గంలో చెరువులకు, నాలాలకు భద్రత కరువు, వరద విపత్తులకు మార్గం..

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం..

# ఇళ్లలో చేరిన వరదనీరు



హైదరాబాద్ పెన్ పవర్:ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం (ఆగస్టు 10) కురిసిన భారీ వర్షం అతలాకుతలం చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ముంపు పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం తీవ్రతకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు పొంగిపొర్లి పరిసర ప్రాంతాలను ముంచెత్తాయి.

-3లో

## ఓటింగ్ పద్ధతిలో ప్రజలు మార్పు

# కోరుకుంటే మార్చడంలో తప్పులేదు



హైదరాబాద్ పెన్ పవర్:నాడు ప్రజాభిప్రాయం ప్రకారం బ్యాలెట్ పేపర్ నుంచి ఈవీఎం వైపు మొగ్గు చూపి ఎన్నికల సంస్కరణలు జరిగాయని మాజీ హోంమంత్రి, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. మళ్లీ అదే ప్రజలు మార్పు కోరుకుంటే ప్రజాభిప్రాయ సేకరణ చేసి మార్చడంలో తప్పులేదని అభిప్రాయపడ్డారు. గుంటూరులో మాజీ ఎంపీ యలమంచిలి శివాజీని జానారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

-3లో

# కబ్జాల ఊబిలో..! చారిత్రక వారసత్వ సంపద..




నాలాపై అక్రమ నిర్మాణాన్ని 2024 ఆగష్టు 16న ఏసిపి సాయిబాబా సీజ్ చేసిన ఫైల్‌ఫోటో..



ఫాక్స్‌సాగర్ నాల ఆక్రమణలో "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్..

**ఫాక్స్‌సాగర్ నాలా ఆక్రమణలకు మూలం అధికారులే..! చట్టంలోని లొసుగులకే ప్రాధాన్యత ఇస్తూ..! చారిత్రక వారసత్వ సంపదకు రక్షణ లేకుండా పోతోంది.. సుచిత్ర రోడ్డులో ఫాక్స్‌సాగర్ నాలాపై ఒకేచోట మూడు కబ్జాలు అధికారుల అండతోనే కొనసాగాయి.. మొక్కుబడిగా అధికారులు సీజ్ చేసిన నిర్మాణం, పూర్తయింది.. కేసు పెట్టామని అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డు వలే..! కుత్బుల్లాపూర్ సర్కిల్-25 డిప్యూటీ కమిషనర్ సమాధానం అధికారుల ధనార్జనకు నిదర్శనం.. ఓవైపు నగరంలోని కొన్ని అక్రమ కట్టడాలపై హైకోర్టు ఉత్తర్వులు, జీహెచ్ఎంసి కమిషనర్‌పై చివాట్లతో, అప్రమత్తమై సర్క్యులర్ జారీ చేసిన కర్ణన్, ఈ ఫాక్స్‌సాగర్ కబ్జాలపై నోరు మెదపకపోవడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..**

**- మొదటి పేజి తరువాయి**

కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధి సుచిత్రా రోడ్డులో భారీ కట్టడాలు.. ఫాక్స్‌సాగర్ నాలాపైనే "తిరుమల హైట్స్" అపార్ట్‌మెంట్ పూర్తిచేయగా..! ఈమధ్యనే పూర్తిగా నాలామీద బిల్డర్ శ్రీధర్ నిర్మించిన, మార్వాడికి చెందిన షాపింగ్ మాల్‌కి ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో పాటు, ముగ్గురు అధికారపార్టీ నేతలకు లక్షల్లో ముడుపులు ముట్టాయని ఆరోపణలు.. ఓ ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు స్వయంగా తానే ఇచ్చినట్టు, బిల్డర్ చెప్పకనే చెప్పాడు..? నాలా స్థలంలో నిర్మించిన సంబంధిత మార్వాడి అక్రమ కట్టడాన్ని, 2024 ఆగస్టు 16న టౌన్‌ప్లానింగ్ అధికారి (ఏసిపి) సాయిబాబా ఈ కట్టడాలను సీజ్ చేశారు. అయితే, బిల్డర్ శ్రీదర్ అధికారులకు ముడుపులు చెల్లించి..? నిబంధనలకు విరుద్దంగా, సీజర్‌ను తొలగించుకుని పనులు ప్రారంభించారు.. చారిత్రక నాలాపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యింది.. మరోవైపు సంబంధిత అక్రమ భవనం యజమాని ఇతరులకు అద్దెకిస్తున్నట్లు ఫోన్ నెంబర్‌ను బోర్డుపై పెద్ద అక్షరాలతో రాశాడు.. ఈ అక్రమాలు నార్త్ ట్యాంక్ డివిజన్ ఇరిగేషన్ అధికారులు, కుత్బుల్లాపూర్ రెవెన్యూ, జీహెచ్ఎంసి సర్కిల్-25 అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫాక్స్‌సాగర్ లేక్, సుమారు 490 ఎకరాల విస్తీర్ణంతో ఉండగా..! ప్రస్తుతం ఇప్పుడు 120 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లు ఆరోపిస్తున్నారు.. ఈ ఫాక్స్‌సాగర్ లేక్‌తో సంబంధం ఉన్న నాలాలు (గొలుసుకట్టు కాలువలు) కూడా ఇప్పుడు కబ్జాల బారిన పడ్డాయని స్థానికులు, మరియు పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు..

## నాలాపై నిర్మాణానికి.. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్..

విద్యుత్ శాఖ అధికారులు కూడా నిబంధనలను అతిక్రమించి అక్రమార్కులకి సహకరిస్తున్నారు. కొందరు ఏఈల సమాధానం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది.. నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తప్పనిసరి పరిశీలించాలని..! అనుమతులకు అనుగుణంగా కట్టడాలు ఉన్నాయా లేవా..? అనే విషయాన్ని పరిగణలోకి తీసుకుని, ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు, చట్టాలు ఉన్నప్పటికీ..! స్థానిక నేతల సిఫార్సులు, ప్రలోభాలకు లోబడి, ఇలాంటి నాలాపై నిర్మాణాలకు..! ప్రభుత్వ భూముల్లో కూల్చేసిన అక్రమ షెడ్లకు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకపోయినా..! విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేయడం పరిపాటిగా మారింది.. పైగా ట్రాన్స్‌ఫార్మర్ కాంట్రాక్టర్‌లు పెడతారని, తమకు సంబంధం లేదని చెప్పడం గమనార్హం.. సైట్ వెరిఫికేషన్ సహా, ప్రతిపాదనలు పెట్టకపోతే, కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పెట్టడం సాధ్యమేనా..?



జేకే నగర్‌లో 2022 అక్టోబర్ 31న లేఅవుట్ పార్కుస్థలం, నాలా బఫర్ జోన్, కబ్జాను కూల్చివేత..ఫైల్‌ఫోటో.



కూల్చిన చోటనే మళ్ళీ అక్రమ నిర్మాణం.. ప్రస్తుత ఫోటో..



ఫాక్స్‌సాగర్ నాలాపై బిల్డర్ శ్రీదర్ నిర్మించిన అక్రమ కట్టడం.. నిర్మాణం ప్రారంభపు ఫైల్‌ఫోటో ..

## నాలాపై అక్రమ నిర్మాణంపై.. ఉన్నతాధికారులూ పెడచెవిన పెట్టారు..

ఫాక్స్‌సాగర్ నాలా 1897-99 నిర్మితమైన చారిత్రక ఆధారాలను అధికారులు కనుమరుగు చేస్తున్నారు.. 2018 నాటి అధికారులు జారీచేసిన నాలా స్కెచ్‌ప్లాన్ ప్రకారం.. బిల్డర్ శ్రీదర్ నిర్మించిన మార్వాడి షాపింగ్ కాంప్లెక్స్ పూర్తిగా నాలాపైనే ఉందని సాక్షాత్కరిస్తుంది.. ఈ విషయాన్ని "పెన్ పవర్" దినపత్రికలో పలుమార్లు ప్రచురించి, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, జీహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినా, తాత్కాలిక చర్యలతో మమః.. శాశ్వత చర్యలు శూన్యం.. నాలాపై నిర్మాణాన్ని వ్యాపార సముదాయంగా మార్చిన అక్రమార్కులు అద్దెకు సిద్దంగా పెట్టిన వైనం..

## జేకేనగర్‌లో ఇటు పార్కుస్థలం.. అటు నాలా బఫర్..

జేకేనగర్ లేఅవుట్‌లో కబ్జాకు గురైన, పార్కుస్థలం ఫాక్స్‌సాగర్ బఫర్ జోన్‌లో ఉందని, వెంచర్ నిర్వాహకులు వి.కృష్ణమూర్తి, లేఅవుట్ చేసినప్పుడే, పార్కు స్థలంగా కేటాయించారు.. అయితే వెంచర్‌కి స్థలం విక్రయించిన కుటుంబీకుల, వారసులే ఈ కబ్జాలకు పాల్పడటం విశేషం.. జేకే నగర్‌లో ఫాక్స్‌సాగర్ నాలా పక్కనే (బఫర్ జోన్‌లో) ఉన్న ఈ పార్కు స్థలాన్ని, నాడు తండ్రులు విక్రయించిన, స్థలాన్ని తనయుడు, క్రైమ్ రిపోర్టర్ ముసుగులో 30 ఫీట్ల నాలా బఫర్ జోన్‌ను(పార్కుస్థలం) కబ్జాకు పాల్పడటంపై..! కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు 2021 ఫిబ్రవరిలో ఒకసారి..! 2022 అక్టోబర్ 31న మరోసారి ఈ నిర్మాణాలను కూల్చివేశారు.. అయితే, తాజాగా కూల్చిన చోటనే మళ్ళీ నిర్మాణాలు చేపట్టడంపై, రెవెన్యూ, ఇరిగేషన్ బహిరంగంగానే సహకరిస్తున్నారు. "అప్పుడు తెలియక కూల్చేశారో ఏమో" అని చెబుతున్న కుత్బుల్లాపూర్ తహశీల్దార్‌కి, ఇప్పుడు తెలిసిన నిజం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు..

## నాలుగేళ్ళుగా అక్రమ పర్మిషన్‌ల రద్దులేదు..!

జేకేనగర్ పార్కు స్థలం కబ్జాలో అధికారుల తీరు స్థానికులకు ఆగ్రహం తెప్పిస్తుంది.. ఈ వ్యవహారంలో ప్రధానమైనది నీటిపారుదల శాఖ.. అసలు ఉందా, లేదా ఇతర శాఖలో విలీనం చేశారా..? అనే అనుమానాలను రేకెత్తిస్తుంది.. 2020-21లో జీహెచ్ఎంసీ సర్కిల్-25 అధికారులు సైట్ వెరిఫికేషన్‌లో ఫాక్స్ సాగర్ నాలాను పరిగణనలోకి తీసుకోకుండా (నాలాను ఇతరుల స్థలంగా చూపిస్తూ) నాలుగు నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు.. గత నాలుగేళ్లలో రెండుసార్లు అక్రమ నిర్మాణాలను కూల్చినప్పటికీ, తాజాగా అదేచోట నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించడంలో, మూడు శాఖలు వెనకడుగు వేస్తున్నారు.. అక్రమంగా మంజూరు చేసిన అనుమతులను కూడా రద్దు చేయలేదు.. హైకోర్టు ఆదేశాలను సాకుగా చూపిస్తూ, కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పిటిషనర్ ఒకవేళ ఆక్రమణకు పాల్పడినట్లు రుజువైతే పిటిషనర్‌పై అధికారులు తీసుకునే చర్యలను ఈ హైకోర్టు నిరోధించదని ఆర్డర్‌లో స్పష్టతను ఇచ్చింది.. అయినప్పటికీ, ఈ కోర్టు ఆదేశాల సాకుతో, అధికారుల చర్యలకు నిర్లక్ష్యం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు..

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం.. ఇళ్లలో చేరిన వరదనీరు

- మొదటి పేజి తరువాయి

పలు గ్రామాల్లో రహదారులు జలమయమై రవాణా అంతరాయం ఏర్పడింది. నిర్మల్ జిల్లా అక్కపూర్‌లో ఎప్పుడూ లేనంతగా 10.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో 7.2 సెం.మీ. వర్షం కురిసింది. ప్రత్యేకించి ఇచ్చోడ మండల కేంద్రంలో గంటపాటు కురిసిన భారీ వర్షం అక్కడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఇచ్చోడలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి, దుకాణాల్లోకి వరదనీరు చేరింది. ప్రధాన రహదారులు ముంపులో చిక్కుకోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మురుగుకాలువల నిర్వహణ సరిగా లేకపోవడమే వరదనీరు ఇళ్లలోకి చేరడానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా ముంపు సమస్య తలెత్తుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత కొన్నేళ్లుగా మురుగుకాలువలు శుభ్రపరిచే పనులు సరిగా జరగడం లేదు. మౌలిక వసతులు మెరుగుపర్చకపోతే ఈ సమస్యలు మళ్లీ మళ్లీ వస్తూనే ఉన్నాయి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాలువల శుభ్రపరిచే పనులు చేపట్టాలని, శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఓటింగ్ పద్ధతిలో ప్రజలు మార్పు కోరుకుంటే మార్చడంలో తప్పులేదు

- మొదటి పేజి తరువాయి

ఉమ్మడి రాష్ట్రంలో నాడు గుంటూరు జిల్లాఇంఛార్జి మంత్రిగా పలు అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేసుకున్నారు. నేటి యువత విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. చారిత్రక కారణాలతో ఉమ్మడి రాష్ట్రం భౌగోళికంగా విడిపోయినా.. మానసికంగా తెలుగు ప్రజలు విడిపోలేదన్నారు.

## ట్రంప్‌పై పరోక్ష వ్యాఖ్యలతో విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకం విధించిన నేపథ్యంలో, కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ, దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. “కొందరు ‘బాస్’లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వేగాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని వారు అనుకుంటున్నారు?” అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా, ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ (%దీజుమీ%) కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. “కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయి, తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుంది” అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ, “భారత్ ఇంత వేగంగా ముందుకు సాగుతోంది, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో ఒక గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదు” అని ఆయన ధీమాగా చెప్పారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ రంగంలో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు. “ఒకప్పుడు ఆయుధాల నుంచి యుద్ధ విమానాల వరకు దిగుమతి చేసుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు మనం వాటిని మన దేశంలోనే తయారు చేయడమే కాకుండా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఒకప్పుడు అతి తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు ఏకంగా రూ. 24,000 కోట్లకు పెరిగాయి. ఇది మన పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనం” అని ఆయన వివరించారు. దేశ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, రక్షణ రంగం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# ఫాస్టాగ్ వన్ ఇయర్ పాస్...

- ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ అమలు
- రూ. 3,000 చెల్లిస్తే ఏడాది లేదా 200 ట్రిప్పుల వ్యాలిడిటీ
- కేవలం ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తింపు
- జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు
- రాష్ట్ర రహదారులపై ఈ పాస్ పనిచేయదు
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు




**హైదరాబాద్ పెన్ పవర్:** వాహనదారులకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఒక శుభవార్త అందించింది. టోల్ ప్లాజాల వద్ద చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు ‘ఫాస్టాగ్ వార్షిక పాస్’ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త పథకం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15, 2025 నుంచి అందుబాటులోకి రానుంది. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి పదేపదే రీఛార్జ్ చేసుకునే శ్రమను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ వార్షిక పాస్ ధరను రూ. 3,000గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని చెల్లించిన ప్రైవేట్ వాహన యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఈ పాస్‌ను కొనుగోలు చేయాలంటే వాహనానికి ఇప్పటికే ఫాస్టాగ్ యాక్టివ్‌గా ఉండాలి. ‘రాజ్‌మార్గ్ యాత్ర’ యాప్ లేదా NHAI అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అయితే, ఈ పాస్ కేవలం NHAI, కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు. ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్, అటల్ సేతు వంటి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని రహదారులపై ఈ పాస్ పనిచేయదు. అటువంటి మార్గాలలో ప్రయాణించేటప్పుడు ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి యథావిధిగా టోల్ రుసుము కట్ అవుతుంది. ఒక వాహనంపై తీసుకున్న పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడానికి వీలుండదు. అలాగే, 200 ట్రిప్పులు లేదా ఏడాది గడువు ముగిసిన తర్వాత పాస్ గడువు ముగుస్తుంది. వినియోగదారులు కావాలనుకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్‌కు ఆటో-రెన్యూవల్ సౌకర్యం లేదు.

# బిగ్ బాస్ షోలో అవకాశం అంటూ డాక్టర్ కు టోకరా

- సీజన్ 16, 17లో అవకాశం అంటూ.. డాక్టర్‌ను రెండేళ్లుగా తిప్పిన కేటుగాడు!
- భోపాల్‌కు చెందిన డాక్టర్ అభినీత్ గుప్తా నుంచి రూ. 10 లక్షల వసూలు
- నిందితుడు కరణ్ సింగ్‌పై ముంబై పోలీసులకు ఫిర్యాదు
- సీజన్ 16, 17లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ అంటూ రెండేళ్లుగా మాయమాటలు
- మోసం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన టెలివిజన్ రియాలిటీ షో ‘బిగ్ బాస్’లో పాల్గొనే అవకాశం ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి తనను రూ. 10 లక్షలు మోసం చేశాడని భోపాల్‌కు చెందిన చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ అభినీత్ గుప్తా ఆరోపించారు. ఈ ఘటనపై ఆయన ముంబైలోని ఓషివారా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో భోపాల్‌లోనూ ఓసారి ఫిర్యాదు చేసినప్పటికీ, తాజాగా ముంబైలో కేసు నమోదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభినీత్ గుప్తా ఈ మోసం వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2022లో కరణ్ సింగ్ అనే వ్యక్తి తనను సంప్రదించి, ‘బిగ్ బాస్’ నిర్వాహకులతో తనకు మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మబలికాడు. షోలో పాల్గొనేందుకు మొదట కోటి రూపాయలు డిమాండ్ చేయగా, అంత డబ్బు తన వద్ద లేదని అభినీత్ చెప్పారు. ఆ తర్వాత రూ. 60 లక్షలకు ఒప్పందం కుదిరిందని, ఆ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాలని కరణ్ సూచించాడు.
ఈ క్రమంలోనే తనను ముంబైకి పిలిపించి, ఎండెమోల్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్ షాతో సమావేశం ఏర్పాటు చేసినట్లు కరణ్ చెప్పాడని, ఆ తర్వాత డబ్బు డిమాండ్ చేయడంతో తాను రూ. 10 లక్షలు అతడికి బదిలీ చేశానని అభినీత్ పేర్కొన్నారు. అయితే, ‘బిగ్ బాస్ సీజన్ 16’ కంటెస్టెంట్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో కరణ్‌ను ప్రశ్నించగా, వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా మధ్యలో పంపిస్తానని చెప్పాడని తెలిపారు. ఆ సీజన్ ముగిశాక, తర్వాతి సీజన్‌లో అవకాశం ఇప్పిస్తానని మాట మార్చాడని అభినీత్ ఆవేదన వ్యక్తం చేశారు. “సీజన్ 17 కూడా ముగిసిపోవడంతో నా డబ్బు వాపస్ ఇవ్వాలని కరణ్‌ను కోరాను. కానీ అతడు నన్ను తిప్పుతూనే ఉన్నాడు. చివరకు పోలీసులను ఆశ్రయించగా, దాదాపు రెండేళ్ల తర్వాత ఎంతో కష్టపడి ఎఫ్ఐఆర్ నమోదు చేయగలిగాను” అని ఆయన వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 420 కింద మోసం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తనలా మరెవరూ ఇలాంటి మోసగాళ్ల బారిన పడకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటపెడుతున్నట్లు అభినీత్ గుప్తా స్పష్టం చేశారు.

# ఆనాడు సాయం.. నేడు ప్రయోగం.. అమెరికా శాటిలైట్‌తో ఇస్రో సరికొత్త చరిత్ర

- 6,500 కేజీల కమ్యూనికేషన్ శాటిలైట్ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తి
- రాబోయే రెండు నెలల్లోనే ప్రయోగం ఉంటుందని ఇస్రో ఛైర్మన్ వెల్లడి
- ఒకప్పుడు అమెరికా నుంచి రాకెట్ తీసుకున్న భారత్.. నేడు ఆ దేశ శాటిలైట్‌నే ప్రయోగిస్తోంది
- ఇటీవలే నిసార్ మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన భారత అంతరిక్ష సంస్థ
- ఇప్పటికే 34 దేశాలకు చెందిన 433 శాటిలైట్లను ప్రయోగించిన ఇస్రో



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు చిన్న రాకెట్ కోసం అగ్రరాజ్యం అమెరికా వైపు చూసిన భారత్, ఇప్పుడు అదే అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహాన్ని తన సొంత గడ్డపై నుంచి నింగిలోకి పంపే స్థాయికి ఎదిగింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) త్వరలో ఈ చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇటీవల నాసా–ఇస్రో సంయుక్త 'నైసర్' మిషన్‌ను విజయవంతం చేసిన ఉత్సాహంతో, మరో కీలక ఘట్టానికి నాంది పలుకుతోంది. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాబోయే రెండు నెలల్లో అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేసుకుంటూ, భారత అంతరిక్ష ప్రస్థానంలోని అద్భుతమైన పురోగతిని వివరించారు. "ఆరు దశాబ్దాల క్రితం అమెరికా నుంచి మనం ఓ చిన్న రాకెట్‌ను అందుకున్నాం. కానీ ఇప్పుడు, అదే అమెరికా తయారు చేసిన భారీ ఉపగ్రహాన్ని మన రాకెట్ తో, మన భూభాగం నుంచి ప్రయోగించబోతున్నాం. ఇది ఎంతటి అద్భుతమైన ప్రగతి?" అని ఆయన వ్యాఖ్యానించారు. 1963లో ఇస్రో ప్రస్థానం ప్రారంభమైనప్పుడు, అభివృద్ధి చెందిన దేశాల కన్నా భారత్ సాంకేతికంగా వెనుకబడి ఉండేది. ఆ ఏడాది నవంబర్ 21న అమెరికా అందించిన చిన్న రాకెట్ ప్రయోగంతోనే భారత అంతరిక్ష కార్యక్రమానికి బీజం పడింది. ఆ తర్వాత 1975లో కూడా అమెరికా శాటిలైట్ డేటా సహాయంతోనే ఇస్రో దేశంలోని 2,400 గ్రామాల్లో టెలివిజన్ల ద్వారా 'మాస్ కమ్యూనికేషన్' ప్రయోగాన్ని విజయవంతం చేసింది.

ఇటీవల జూలై 30న ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నైసర్ (నాసా–ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని జీఎస్‌ఎల్‌వి–ఎఫ్16 రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ మిషన్ కచ్చితత్వంపై నాసా శాస్త్రవేత్తలు సైతం ఇస్రో పనితీరును ప్రశంసించారు. "ఈ విజయంతో మనం అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచాం" అని నారాయణన్ పేర్కొన్నారు. ఒకప్పుడు శాటిలైట్ టెక్నాలజీ లేని స్థాయి నుంచి, గడిచిన 50 ఏళ్లలో ఇస్రో అప్రతిహత ప్రగతిని సాధించింది. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను తన సొంత రాకెట్ల ద్వారా విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

# చాట్‌జీపీటీ సలహా గుడ్డిగా నమ్మి... ఆసుపత్రి పాలయ్యాడు!

- చాట్‌జీపీటీ డైట్ సలహాతో అమెరికాలో వ్యక్తికి తీవ్ర అస్వస్థత
- ఉప్పుకు బదులుగా బ్రోమైడ్ వాడకంతో ప్రాణాంతక పాయిజనింగ్
- మతిస్థిమితం కోల్పోయి ఆసుపత్రిలో చేరిక
- ఆరోగ్య సలహాల కోసం ఏఐని గుడ్డిగా నమ్మొద్దని నిపుణుల హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్నాలజీ వాడకం పెరిగాక, చాలామంది చిన్న చిన్న సలహాల కోసం కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మీద ఆధారపడుతున్నారు. కానీ, ఈ నమ్మకమే కొన్నిసార్లు ప్రాణాల మీదకు తెస్తుందని అమెరికాలో జరిగిన ఓ సంఘటన తీవ్రంగా హెచ్చరిస్తోంది. చాట్‌జీపీటీ ఇచ్చిన ఓ డైట్ సలహాను గుడ్డిగా పాటించిన ఓ వ్యక్తి, ప్రాణాంతకమైన బ్రోమైడ్ పాయిజనింగ్ బారిన పడి ఆసుపత్రి పాలయ్యాడు. ఏఐ సలహా వల్ల ఈ రకమైన పాయిజనింగ్ జరగడం ప్రపంచంలో ఇదే మొదటిసారి కావచ్చని వైద్యులు చెబుతున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన వైద్యులు ఈ వింత కేసు వివరాలను 'అనల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్: క్లినికల్ కేసెస్' అనే జర్నల్‌లో ప్రచురించారు. వారి కథనం ప్రకారం, ఓ వ్యక్తి తన ఆహారంలో ఉప్పుకు బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయం కోసం చాట్‌జీపీటీని సలహా అడిగాడు. దానికి ఏఐ సోడియం బ్రోమైడ్‌ను సూచించింది. దానివల్ల కలిగే ప్రమాదాల గురించి ఎలాంటి హెచ్చరిక చేయకపోవడంతో, ఆ వ్యక్తి మూడు నెలల పాటు దానిని తీసుకున్నాడు.

కొంతకాలానికి అతని ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. తన పొరుగింటి వారు తనపై విష ప్రయోగం చేస్తున్నారని భయపడుతూ ఆసుపత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించగా, దాహం వేస్తున్నా నీళ్లు తాగడానికి నిరాకరించడం, భ్రమలకు లోనవడం, తీవ్రమైన ఆందోళన వంటి లక్షణాలు కనిపించాయి. అతని పరిస్థితి మరింత దిగజారి, మతిస్థిమితం కోల్పోవడంతో వైద్యులు అతడిని మానసిక చికిత్స కోసం ప్రత్యేక వార్డుకు తరలించాల్సి వచ్చింది. చికిత్సలో భాగంగా అతనికి యాంటీసైకోటిక్ మందులు, ఫ్లూయిడ్స్ ఎక్కించడంతో క్రమంగా కోలుకున్నాడు. కాస్త నిలకడగా అయ్యాక, అసలు విషయం వైద్యులకు చెప్పాడు. ఉప్పుకు బదులుగా ఏఐ చెప్పిన సలహా పాటించానని, అదే ఇంతటి ప్రమాదానికి కారణమని తెలియదని వాపోయాడు. ఆసక్తికరంగా, వైద్యులు అదే ప్రశ్నను మళ్లీ చాట్‌జీపీటీని అడిగినప్పుడు, అది మళ్లీ బ్రోమైడ్‌ను సూచించిందే తప్ప, దాని ప్రమాదాల గురించి హెచ్చరించలేదు. గతంలో బ్రోమైడ్ సమ్మేళనాలను ఆందోళన, నిద్రలేమి మందులలో వాడేవారు. కానీ వాటి తీవ్ర దుష్ప్రభావాల కారణంగా దశాబ్దాల క్రితమే నిషేధించారు. ప్రస్తుతం పశువుల మందులు, కొన్ని పారిశ్రామిక ఉత్పత్తులలో మాత్రమే దీనిని వాడుతున్నారు. సుమారు మూడు వారాల చికిత్స తర్వాత ఆ వ్యక్తి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. ఈ సంఘటన ఒకటే చెబుతోందని, శాస్త్రీయ సమాచారం కోసం ఏఐ ఉపయోగపడినా, వైద్య సలహాలకు మాత్రం దానిని ఎప్పటికీ ప్రత్యామ్నాయంగా భావించరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అన్నా రావాలా.. చెల్లి ఐయామ్ అవుటాఫ్ స్టేషన్.. కేటీఆర్ vs కవిత చాటింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కుటుంబ విభేదాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. గత ఏడాది మధ్యం కుంభకోణం కేసులో జైలుకెళ్లిన కవిత, రాఖీ పండుగ సమయానికి జైల్లో ఉండగా, పార్టీ మహిళా నాయకులు కేటీఆర్‌కు రాఖీ కట్టి ఆ లోటును తీర్చారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత కవిత స్వయంగా తన సోదరుడికి రాఖీ కట్టారు. ఆ సందర్భం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

కవితకు బెయిల్ వచ్చేలా కేటీఆర్ తీవ్రంగా కృషి చేశారు. రోజులు తరబడి ఢిల్లీలో ఉండి లీగల్, పొలిటికల్ లాబీయింగ్ చేసి ఆమెను విడుదల చేయించారు. అయితే ఆ తర్వాత ఇద్దరి మధ్య దూరం ఏర్పడింది. కవిత రాసిన కొన్ని లేఖలు, చేసిన వ్యాఖ్యలు దయ్యాలు, గ్రీకువీరులు, కోవర్టులు అంటూ వచ్చిన ఆరోపణలు ఈ విభేదాలను మరింతగా ముదిర్చాయి. ఈ క్రమంలోనే కే.సి.ఆర్ కవితకు అపాయింట్మెంట్ ఇవ్వలేదనే వార్తలు కూడా వెలువడ్డాయి.

ఇక తాజా పరిణామాలు రాఖీ పండుగ చుట్టూ తిరుగుతున్నాయి. ఈ సారి కవిత కేటీఆర్‌కు రాఖీ కట్టేందుకు ప్రయత్నించారని, ముందుగానే మెసేజ్ పంపారని సమాచారం. కానీ కేటీఆర్ "అవుట్ ఆఫ్ స్టేషన్" అని సమాధానమిచ్చారని తెలుస్తోంది. కవిత వస్తానంటే వద్దన్నట్లు ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పటికే వారి మధ్య ఉన్న విభేదాలు తారస్థాయికి చేరాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇది కొనసాగితే పార్టీ అంతర్గత వాతావరణంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. గులాబీ దళపతి ఈ కుటుంబ కలహాలను ఎలా పరిష్కరిస్తారో, లేక ఇవి మరింత ముదిరి పార్టీకి సవాళ్లు సృష్టిస్తాయో అనేది చూడాల్సి ఉంది.

## అమెరికాలోని జార్జియాలో పడిన ఉల్క.. భూమికంటే పురాతనమైందని గుర్తించిన శాస్త్రవేత్తలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలోని జార్జియాలో ఇటీవల రాలిన ఉల్కను పరిశీలించిన శాస్త్రవేత్తలు సంచలన విషయం గుర్తించారు. సదరు ఉల్క శకలం భూమికంటే పురాతనమైందని వెల్లడించారు. గత జూన్ 26న జార్జియాలోని మెక్‌డొనౌగ్‌లో ఓ ఇంటిపై ఉల్క శకలం పడింది. ఇంటి పైకప్పును శిథిలం చేస్తూ నేలను తాకింది. సూపర్ సోనిక్ వేగంతో భూమిపై పడినప్పుడు వచ్చిన శబ్దం చాలా దూరం వినిపించింది. చిన్న చెర్రీ పండు పరిమాణంలో 23 గ్రాముల బరువున్న ఈ శకలం తాకిడికి నేలపై చిన్న గుంత ఏర్పడింది.

ఈ శకలాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ శకలం దాదాపు 4.56 బిలియన్ సంవత్సరాల క్రితం తయారైందని జియాలజిస్టులు తెలిపారు. అంటే ఇది భూమి కంటే దాదాపు 2 కోట్ల సంవత్సరాల పూర్వం ఏర్పడిందని చెప్పారు. అంగారకుడు, బృహస్పతికి మధ్య ఉన్న ఓ తోకచుక్క నుంచి విడివడ్డ శకలం అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

# బీజేపీ గూటికి గువ్వల బాలరాజు.. ఫాంహౌస్ ఎమ్మెల్యేలు ఇక వరస పెడతారా?




**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. అయితే ఇందులో ఆసక్తికరమయిన విషయం ఏంటంటే 2022లో మొయినాబాద్ ఫాం హౌస్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ ప్రయత్నించిందన్న వీడియోలు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బయటపెట్టారు. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనను నాడు ఫేక్ అని వాదించిన బీజేపీ నేడు నిజం చేసేలా వ్యవహరిస్తుంది. నాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, పైలెట్ రోహిత్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావులను కర్ణాటక బీజేపీ నేత బీఎల్ సంతోష్ తోపాటు మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు యత్నించారన్న ఆరోపణలు వచ్చాయి.

**నాడు ఉప ఎన్నికలకు ముందు...**

అయితే మునుగోడు ఉప ఎన్నికలకు ముందు ఇది జరగడంతో అది నాడు సంచలనంగా మారింది. ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం బాగా దెబ్బతీసింది. నాటి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు ఎమ్మెల్యేల కొనుగోలు ఒక కారణమయిందనే చెప్పాలి. దాని నుంచి తేరుకునేలా ఇప్పుడు వాటిని నిజం చేస్తుంది. కానీ దానిని బీజేపీ ఇప్పుడు అధికారికంగా నిజం చేస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే తాజాగా గువ్వల బాలరాజు బీజేపీ లోచేరడంతో మిగిలిన మాజీ ఎమ్మెల్యేలు కూడా బీఆర్ఎస్ ను వదిలి బీజేపీలో చేరతారన్న ప్రచారం ఊపందుకుంది. గువ్వల బాలరాజు చేరిన తర్వాత మిగిలిన నేతలు కూడా త్వరలోనే కమలం తీర్థం కప్పుకుంటారని అంటున్నారు.

**టిక్కెట్ రాదనే...**

అయితే గువ్వల బాలరాజు మాత్రం బీజేపీలో చేరింది బీఆర్ఎస్ లో అసంతృప్తి కారణమని అంటున్నారు. ప్రధాన కారణం గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తాను నాగర్ కర్నూలు అభ్యర్థిత్వాన్ని కోరినా అధినాయకత్వం అంగీకరించలేదు. అక్కడ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను బరిలోకి దించింది. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లోనూ తనకు అచ్చంపేట టిక్కెట్ ఇవ్వకుండా

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఇస్తారని సమాచారం అందడంతోనే గువ్వల బాలరాజు బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరిపోయారు. అయితే మిగిలిన ముగ్గురు మొయినాబాద్ ఫాం హౌస్ నేతలను కూడా పార్టీలోకి తీసుకుంటారన్న ప్రచారంలో వాస్తవమెంత అన్నది భవిష్యత్ లో తేలనుంది. అయితే మిగిలిన వారు బీజేపీలో చేరే అవకాశం లేదని కారు పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ ఎప్పుడు ఏమైనా జరగవొచ్చన్న వ్యాఖ్యలు కమలం పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.

# ఏపీ రాజకీయాల్లో కలకలం: వైసీపీ లోకి వచ్చే నేతల లిస్ట్ బయటకు




**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారా? అంటే అవుననే అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరగనున్నాయి. ప్రస్తుతమున్న 175 నియోజకవర్గాల నుంచి 225 నియోజకవర్గాలకు అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరగనుంది. అయితే ఈసారి ఎన్నికల్లో బలమైన నేతలను బరిలోకి దించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో మాదిరిగా తన ఫొటోను నమ్ముకుని ఎన్నికలకు వెళితే బొక్కా బోర్లాపడతామని ఆయన భావిస్తున్నారు. కేవలం అభ్యర్థుల ఎంపికతోనే విజయం సాధ్యమవుతుందని ఆయనకు సీనియర్ నేతలకు సూచనలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయన తన నిర్ణయాన్ని పునస్సమీక్షించుకోవడానికి రెడీ అయిపోయినట్లు వార్తలు వస్తున్నాయి.

**అసంతృప్తితో ఉన్న నేతలు...**

ఎన్నికలు దగ్గర పడే సమయంలో ఇతర పార్టీల నుంచి నేతల రాక మొదలవుతుంది. సహజంగానే అధికార పార్టీపై ఉన్న అసంతృప్తి నేతలతో పాటు టిక్కెట్ దక్కదని భావించిన వారు కూడా వైసీపీ వైపు చూసే అవకాశాలు లేకపోలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ లేదా జనసేన, లేకుంటే వైసీపీ తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదు. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ అందులో చేరి ఎవరూ చేతులు కాల్చుకోవడానికి సిద్ధంగా ఉండరు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో దాదాపు మాయమయిపోయింది. నేతలు కొద్దో గొప్పో ఉన్నా పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఉన్న వారు కొందరయితే, కేంద్రంలో అధికారంలోకి వస్తే తమకు పదవులు వస్తాయని భావించే వారు మాత్రమే కొనసాగుతున్నారు.


**ఇతర పార్టీల నుంచి వచ్చే...**

అందుకే టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి వచ్చే నేతలను వైసీపీ లో చేర్చుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. తన జిల్లాల పర్యటనలో స్థానికనాయకత్వానికి కూడా ఈ మేరకు సంకేతాలు అందచేస్తున్నారు. ఇటీవల జరిగిన పలు సమావేశాల్లోనూ నేతలకు కొత్త నేతలు, పార్టీకిఉపయోగపడే వారు, వారి చేరికతో బలం పెరుగుతుందని భావిస్తే ఖచ్చితంగా చేర్చుకునే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. అటువంటి నేతల జాబితాను తయారు చేయాలని కూడా ఇటీవల జరిగిన రాష్ట్ర యువజన విభాగం నేతలతో సమావేశమయిన జగన్ ఇదే రకమైన వ్యాఖ్యలు చేశారు. సామాజికవర్గ పరంగా బలమైన నేతలు వస్తే , చేర్చుకోవడానికి సిద్ధమని ప్రకటించారు.

**పార్టీని వీడి వెళ్లిన నేతలు...**

అయితే ఇప్పటి వరకూ పార్టీని వీడి వెళ్లిన నేతల విషయంలో మాత్రం జగన్ మనసు మారలేదని తెలిసింది. పార్టీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత కొందరు నేతలు పార్టీని వీడి వెళ్లారు. అనేక నియోజకవర్గాల్లో నేతలు తాను గతంలో ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ వారు కష్టకాలంలో వదిలేసివెళ్లిపోయారు. కొందరు సీనియర్ నేతలు మాత్రం వారిని కూడా చేర్చుకునే విషయంలో పునరాలోచించాలని సీనియర్ నేతలు కోరగా, అందుకు జగన్ పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది. పార్టీని వీడి వెళ్లినవారు ఎంత పెద్దవారైనా, బలవంతులైనా, తన బంధువులైనా సరే తిరిగి తన వద్దకు తీసుకు రావద్దని కూడా నేతలకు సూచించినట్లు తెలిసింది. అలా చేస్తే కార్యకర్తలకు తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# నమ్రత గ్యాంగ్ పెద్ద ప్లాన్...సంతానంలేని దంపతులను గుర్తించిందిలా




**హైదరాబాద్ పెన్ పవర్:**సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పై నమోదయిన కేసులో తవ్వేకొద్దీ ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. సంతానం లేని వారిని గుర్తించేందుకు డాక్టర్ నమ్రత పెద్ద ప్లాన్ వేశారు. తాజాగా సృష్టి కేసులో ఈడీ రంగ ప్రవేశం చేసింది. ఈ కేసు వివరాలను ఇవ్వాలని పోలీసులను ఈడీ అధికారులు కోరారు. దాదాపు 86 మంది పిల్లల చైల్డ్ ట్రాఫికింగ్ కు నమ్రత పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో దాదాపు నలభై కోట్ల రూపాయల మేరకు లావాదేవీలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులతో పాటు ఇక ఈడీ అధికారులు కూడా దర్యాప్తు చేస్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎంత మందిని ఎవరికి విక్రయించారు? బ్యాంకు లావాదేవీలను కూడా పరిశీలించనుంది.

**ఉచిత వైద్య శిబిరాలతో...**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. సంతానం లేని వారు ఈ ఉచిత శిబిరాలకు రావడంతో వారిని గుర్తించడం సులువుగా మారింది. వారికి ఉచిత కన్సెల్టింగ్ ఇస్తామని కూడా నమ్మబలికారు. సంతానం కోసం పరితపించే వారి బలహీనతను సొమ్ము చేసుకునేందుకు డాక్టర్ నమ్రత టీం ఇటువంటి ప్లాన్ లు వేసి భారీగా అటువంటి వారిని గుర్తించడమే కాకుండా, వారికి సంతానప్రాప్తి కలిగిస్తామని నమ్మబలికింది. దీంతో అమాయకులు నమ్రత వలలో పడిపోయారు. సులువుగా నమ్మించేందుకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారిని ఆకట్టుకునేందుకు డాక్టర్ నమ్రత చేసిన ప్రయత్నం సక్సెస్ కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలపై నమ్రత గ్యాంగ్ కన్నేసింది.

**విశాఖకు తరలించి...**

ఉచిత వైద్య పరీక్షల కోసం సికింద్రాబాద్ లోని యూనివర్సిటీ సృష్టి సెంటర్ కు రప్పించేవారు. అక్కడ పరీక్షలు చేసిన తర్వాత ఐవీఎఫ్ ద్వారా సంతాన ప్రాప్తి కలగదని వారికి చెప్పేవారు. సరోగసి ద్వారా సాధ్యమవుతుందని నమ్మకంగా చెప్పేవారు. వారికి చెందిన వీర్యం, అండాలతోనే సంతానం కలుగుతుందని వారిని భ్రమింప చేసేవారు. దీంతో డాక్టర్ నమ్రత చెప్పే మాయమాటలకు సులువుగా బుట్టలో పడిపోయేవారు. ఇలా అనేక మంది ముందుకు రాగా వారిని సికింద్రాబాద్ కు కాకుండా విశాఖపట్నంలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కు పంపించేవారు. అక్కడ ఉన్న సిబ్బంది సరోగసి అయితే ముప్పయి నుంచి అరవై లక్షల రూపాయలు ఖర్చవుతుందని చెప్పేవారు.

**కోట్లాది రూపాయలు వసూలు చేసి...**

ఇందులో అక్కడ మేనేజర్ కల్యాణి కీలక భూమిక పోషించినట్లు పోలీసుల విచారణలో కనుగొన్నారు. అయితే మరొకవైపు మధ్యవర్తులు ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి అమాయక గిరిజన మహిళలకు ఆశ చూపి వారికి పుట్టబోయే శిశువులను తమకు విక్రయించాలని కోరేవారు. అందుకు వారికి నాలుగు లక్షల రూపాయలు మాత్రమే చెల్లించేవారని పోలీసులు తెలిపారు. వారితో శిశువిక్రయ ఒప్పందాలు కూడా కుదుర్చుకునే వారు. అయితే అమాయక పేద మహిళలకు పుట్టిన బిడ్డలను తీసుకు వచ్చి సరోగసి ద్వారా పుట్టిన బిడ్డలంటూ తమ వద్దకు వచ్చిన దంపతులను నమ్మించే వారు. ఇలా ఎంత మందిని కొనుగోలు చేశారు? ఎంతమందికి విక్రయించారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు

# ట్రాఫిక్ సమస్య చెక్ కు కొత్త పంథా.. హైదరాబాదీలకు అలెర్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో భారీ వర్షం కురిస్తే చాలు ఇక ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయి. ఎక్కడికక్కడ గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురికావడంతో పాటు వేలాది లీటర్ల పెట్రోలు కూడా వృధాగా ఆవిరవుతుంది. హైదరాబాద్ వాసులకు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు, కొంత వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు తరహాలోనే ముందుగా సమాచారం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే బెంగళూరులో ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దానిని అనుసరించాలని అధికారులు నిర్ణయించారు. త్వరలోనే దానిని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

**రోడ్లపైన నీరు నిలిచే ప్రాంతాలు...**

హైడ్రా అధికారులతో పాటు తెలంగాణ డెవలప్ మెంట్ ప్లానింగ్ సొసైటీ కలిసి ఈ ప్రయత్నాలను మొదలుపెట్టాయి. భారీ వర్షం కురిసినప్పుడు రోడ్లపై ఎక్కువగా నీరు నిలిచే ప్రాంతాలతో పాటు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలను ముందుగానే అధికారులు గుర్తిస్తారు. ఆ ప్రాంతానికి వెళ్లవద్దంటూ ముందస్తు హెచ్చరికలు జారీ చేయనున్నారు. ఎంత సేపు వరద ప్రభావం ఉంటుంది ముందుగానే తెలియజేయడంతో వాహనదారులు తమ కార్యాలయాల్లోనే వేచి ఉండే అవకాశముంటుందని భావిస్తున్నారు. అలాగే వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీ వర్షం పడినప్పుడు బయటకు రాకుండా అక్కడే ఉండేందుకు ఈ చర్య దోహదపడుతుందని భావిస్తున్నారు.

**ఇళ్లకు బయలుదేరే సమయంలోనే...**

ప్రధానంగా సాయంత్రం వేళ వర్షం అధికంగా కురుస్తుండటంతో పాటు కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరే సమయం కావడంతో ఒక్కసారిగా అందరూ రోడ్లపైకి వస్తున్నారు.రహదారులపై నీరు నిలిచి ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిని పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసుల వల్ల కూడా కావడం లేదు. వేల సంఖ్యలో వాహనాలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్ లో చిక్కుకుపోవడంతో వాటిని క్రమబద్ధీకరించేందుకు కూడా తీసుకుంటున్న పోలీసుల చర్యలు ఎలాంటి ఫలితాలు ఇవ్వడం లేదు. నాలాలు పొంగి రోడ్లపైకి నీరు చేరడంతో వాహనాలు వెళ్లడం లేదు. గంటల పాటు ట్రాఫిక్ లో చిక్కుకుంటున్నారు.

**పదిహేను నిమిషాలకు ఒకసారి...**

దీంతో పడిన వాన వెళ్లిపోయేంత వరకూ వాహనాలతో బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే ఇంత పెద్దయెత్తున ట్రాఫిక్ సమస్యలు ఉండవని అధికారులు భావిస్తున్నారు. కొన్ని గంటల పాటు రోడ్డుపై వాహనాల్లో ఉండే కంటే తమ కార్యాలయాల్లోనే ఉండి కాస్త ఆలస్యమయినా సులువుగా ఇంటికి చేరుకోవచ్చన్న సూచనను చేయనున్నారు. అందుకే వాతావరణ శాఖ చేసిన సూచన అనుసరించి ఇకపై ప్రతి పదిహేను నిమిషాలకు ఒకసారి ప్రజలను వర్షంపై అప్రమత్తం చేయడంతో పాటు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు. వర్షం కురిసి వెలిసిన తర్వాత ఎంతసేపటికి బయటకు రావాలన్నది సూచించనున్నారు.

# హైదరాబాద్ ను ముంచెత్తిన వర్షం... సాయంత్రం ఐదు దాటితే చాలు గుండెల్లో దడ




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం దంచికొట్టింది. అనేక ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో హైదరాబాద్ నగరంతో పాటు నగర శివార్లలో పలుచ్చో ట్రాఫిక్ నిలిచిపోయింది. వేలాది వాహనాలు రోడ్డు మీదనే ఉండిపోయాయి. గంటల తరబడి రోడ్డు మీదనే ఉండిపోవాల్సి వచ్చింది. క్లౌడ్ బరస్ట్ కావడంతో ఒక్కసారిగా కుండపోత వాన కురిసింది. శనివారం రాత్రి పది గంటలకు మొదలయిన వర్షం దాదాపు గంట సేపు కొనసాగింది. ఈ గంట ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నగరవాసులు బితుకు బితుకు మంటూ గడపాల్సి వచ్చింది. మరొకవైపు ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు, పిడుగులు కూడా అనేక చోట్ల పడటంతో వర్షం బీభత్సంగా మారింది.

**అనేక ప్రాంతాలు నీట మునిగి...**

ఉదయం నుంచి కొంత ఎండ ఉన్నప్పటికీ సాయంత్రానికి కానీ, రాత్రికి గాని భారీ వర్షం వరసగా గత కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తుతుంది. భారీ వర్షం పడటంతో రహదారులపై మోకాళ్ల లోతులో నీళు నిలిచాయి. అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచి వాహనదారులు అవస్థలు పడ్డారు. అందులోనూ శ్రావణ పౌర్ణమి కావడంతో పాటు రాఖీ పండగకు వాహానాలతో బయటకు వచ్చిన వారు ఇళ్లకు చేరతామా? లేదా? అన్న అనుమానం కలిగింది. అమీర్ పేట్, యూసఫ్ గూడ్, చర్మాస్ వెనక ప్రాంతంలో ఉన్న కాలనీలు నీట మునిగాయి.నాలాలు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. మరొకవైపు మూసీ నదిలోనూ వరద నీటి ప్రవాహం ఎక్కువయింది.

**పెళ్లిళ్ల సీజన్ కావడంతో...**

ఇక నగరంలో అనేక చోట్ల మలక్ పేట్, దిల్ సుఖ్ నగర్ వంటి ప్రాంతాల్లో వాహానాలు గంటల కొద్ది నిలిచిపోయాయి. దీంతో పాటు హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్, నాదర్ గుల్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్,మన్సూరాబాద్, బీఎన్ రెడ్డి నగర్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో వర్షం జోరుగా పడటంతో రహదారులపై నీరు నిలిచింది. నిన్న అత్యధికంగా రంగారెడ్డి జిల్లా తొర్రూరులో అత్యధికంగా 12.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. సైదాబాద్ లోని రెడ్డి కాలనీ వర్షపు నీటికి నీట మునిగింది. దీంతో సాయంత్రం అయితే నగరవాసులు బయటకు వెళ్లేందుకు భయపడిపోతున్నారు. అందులోనూ పెళ్లిళ్ల సీజన్ నడుస్తుండటంతో వాటికి హాజరై తిరిగి వచ్చే వారు వర్షంలో చిక్కుకుని ఇబ్బందులు పడ్డారు.

# ఆల్ టైమ్ రికార్డుకు చేరుకున్న బంగారం ధరలు.. వెండి ఇక కొనలేమేమో?




**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటాయి. డిమాండ్ తో సంబంధం లేకుండా, సీజన్ తో నిమిత్తం లేకుండా ధరలు పెరగడం ఒక బంగారానికి మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అనేక కారణాలతో బంగారం, వెండి ధరలు నిత్యం పెరుగుతున్నాయి. దీంతో ధరల పెరుగుదల ప్రభావం కొనుగోళ్లపై పడింది. అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. భారీగా ధరలు పెరగడంతో కొనుగోలు చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్ జోరుగా నడుస్తున్నప్పటికీ బంగారం విక్రయాలు ఊపందుకోవడం లేదని జ్యుయలరీ దుకాణాల యాజమాన్యం లబోదిబోమంటుంది. ఈ ఏడాదిలో అసలు బేరాల్లేవని ఆవేదన చెందుతున్నారు.

**అందుబాటులో ఉంటేనే...**

బంగారం ధరలు అందుబాటులో ఉంటేనే ఎవరైనా కొనుగోలు చేస్తారు. శక్తికి మించి బంగారాన్ని సొంతం చేసుకునేందుకు ఎవరూ ఉత్సాహం చూపరు. అందులోనూ మహిళలు అత్యంత ఇష్టపడే బంగారం విషయంలో ధరలు అమాతం పెరగడంతో వారు కూడా విముఖత చూపుతున్నారు. ఇప్పటికే బంగారం ధర ఆల్ టైంరికార్డును దాటేసింది. లక్ష రూపాయలకు పైగానే కొనసాగుతుండటంతో ఎవరూ కొనుగోలు చేయడానికి ఉత్సుకత చూపడం లేదు. అంతర్జాతీయ మార్కెట్ లో ధరల ఒడిదుడుకులు, ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి తగ్గుదల, విదేశాల్లో నెలకొన్న మాంద్యం వంటి కారణాలతో బంగారం ధరలు ప్రతి రోజూ పెరుగుతూ వినియోగదారులకు షాకిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**నేటి ధరలు ఇలా...**

మరొకవైపు పెట్టుబడి గా చూసేవారు సయితం వెనుకంజ వేస్తున్నారు. ఇంతగా పెరిగిన బంగారం ధరలు తిరిగి తగ్గుతాయేమోనన్న ఆందోళనతో పెట్టుబడి పెట్టే వారు సయితం ప్రత్యామ్నాయ ఆస్తులపై తమ పెట్టుబడులు పెడుతున్నారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,03,040 రూపాయలుగా నమోదయింది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 94,450 రూపాయలకు చేరింది. కిలో వెండి ధర 1, 27, 000 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది. మధ్యాహ్నానికి ధరల్లో మార్పులు, చేర్పులు ఉండవచ్చు.

# ఖమ్మం శివారు కాలనీలో దొంగల కలకలం..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఖమ్మం జిల్లాలో దొంగల సంచారం కలకలం రేపుతోంది. నగర శివార్లలోని గొల్లగూడెంలో ముగ్గురు దొంగలు సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో చూసిన కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున ముసుగులు ధరించిన ముగ్గురు దొంగలు కాలనీలో సంచరించారు.

వీధిలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో కలియతిరుగుతూ డబ్బు, నగల కోసం వెతికారు. ఇంట్లో అమర్చిన సీసీటీవీ కెమెరాలో దొంగల నిర్వాకం మొత్తం రికార్డైంది. రాత్రి కాలనీలో దొంగలు సంచరించిన విషయం ఉదయాన్నే గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సత్తుపల్లి పట్టణంలోని పీవీ నరసింహారావు సింగరేణి కాలరీస్‌లోనూ దొంగలు చోరీకి యత్నించారు.

## ట్రంప్ టారిఫ్ ల దెబ్బకు ధరలు పెరిగాయంటూ అమెరికన్ల గగ్గోలు..

- అమెరికాలోని వాల్ మార్ట్ లో పెరిగిన ధరలను లైవ్ లో చూపించిన మహిళ
- నిత్యావసర వస్తువులు, దుస్తులు ఇతరత్రా వస్తువుల ధరలు పైపైకి..
- ట్రంప్ స్లోగన్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ను గుర్తుచేస్తూ నిజంగానే మనం గ్రేట్ అయ్యామా అంటూ ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాల ప్రభావం ఆ దేశ ప్రజలపైనా పడుతోంది. విదేశాలపై సుంకాల ప్రభావంతో అమెరికాలో నిత్యావసర వస్తువులు, దుస్తుల ధరలు పెరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుంకాలకు ముందు, తర్వాత ధరల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ ఎన్నికల స్లోగన్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ను గుర్తుచేస్తూ.. నిజంగానే మనం గ్రేట్ అవుతున్నామా అంటూ సోషల్ మీడియాలో ప్రశ్నలు సంధిస్తున్నారు. తాజాగా మెర్సిడెస్ ఛాండ్లర్ అనే మహిళ ఇన్ స్టాలో ఓ వీడియో పోస్టు చేస్తూ ట్రంప్ సుంకాల ప్రభావాన్ని వివరించింది. తాను రెగ్యులర్ గా వెళ్లే వాల్ మార్ట్ లో ట్రంప్ సుంకాల ఎఫెక్ట్ భారీగా కనిపిస్తోందని, అన్ని వస్తువుల ధరలు పెరిగాయని ఆరోపించింది.చిన్న పిల్లల దుస్తులు చూపిస్తూ.. "గతంలో ఈ డ్రెస్ ధర 6 డాలర్ల 98 సెంట్లు ఉండేది. ఇప్పుడు ఇదే డ్రెస్ ధర 10 డాలర్ల 98 సెంట్లకు పెరిగింది. 10.98 డాలర్లుగా ఉన్న మరో డ్రెస్ ధర సుంకాల ప్రభావంతో 11.98 డాలర్లకు చేరింది. బ్యాక్ పాక్ (బ్యాగు) ధర గతంలో 19.97 డాలర్లు కాగా ప్రస్తుతం 24.97 డాలర్లకు చేరింది. సగటున ప్రతీ వస్తువు ధర 4 డాలర్లకు పైనే పెరిగింది. ఆయా వస్తువులకు ఉన్న ప్రైస్ ట్యాగ్ కింద పాత ధరను మీరు స్పష్టంగా చూడొచ్చు. కొన్ని వస్తువుల ట్యాగ్ లపై కొత్తగా స్టిక్కర్ అతికించారు. మీకు నమ్మకం కలగకపోతే దగ్గర్లోని వాల్ మార్ట్ కానీ టార్గెట్ కానీ వెళ్లి చూడండి" అని ఛాండ్లర్ చెప్పారు. ఈ వీడియో వైరల్ గా మారడంతో నెటిజన్లు వ్యంగ్యంగా స్పందిస్తున్నారు. సుంకాల ద్వారా అమెరికాపై డాలర్ల వర్షం కురుస్తోందని ట్రంప్ అంటున్నారు, అయినా మనం కొనే దుస్తులపై అదనంగా మరో డాలర్ చెల్లించాల్సి వస్తోందని విమర్శిస్తున్నారు.

## 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ

- ఈసీఐకి వ్యతిరేకంగా 'ఓట్ చోరీ' పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం
- డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్
- ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల
- సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ
- రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం
- ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు




**హైదరాబాద్ పెన్ పవర్:**లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం" అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు.

గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం "ఆధారరహితమైనవి"గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, రేపు సోమవారం నాడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.

## దేశంలో ఇప్పుడు ఎన్ని వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయో తెలుసా?

- దేశవ్యాప్తంగా 144కి చేరిన వందే భారత్ రైళ్ల సర్వీసులు
- రాజ్యసభలో అధికారికంగా ప్రకటించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్
- వేగం, భద్రత, సౌకర్యాలతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్న రైళ్లు
- గత ఆర్థిక సంవత్సరంలో సుమారు 3 కోట్ల మంది ప్రయాణం
- కొత్తగా బెంగళూరు-బెళగావి సహా మరో మూడు రూట్లలో సేవలు ప్రారంభం




**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ రైల్వే ప్రయాణ రూపురేఖలను మార్చేస్తూ ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు దేశవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని బ్రాడ్ గేజ్ విద్యుదీకరణ నెట్‌వర్క్‌లో మొత్తం 144 వందే భారత్ సర్వీసులు నడుస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రైల్వే మౌలిక సదుపాయాలను ఆధునికీకరించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

ఇటీవల రాజ్యసభలో ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. అధిక రద్దీ ఉన్న మార్గాల్లో ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ సెమీ-హై-స్పీడ్ రైళ్లను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల నుంచి ఈ రైళ్లకు అద్భుతమైన స్పందన వస్తోందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 3 కోట్ల మంది ప్రయాణించగా, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మధ్య 93 లక్షల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

వందే భారత్ రైళ్లలో అత్యాధునిక భద్రతా ఫీచర్‌గా 'కవచ్' యాంటీ-కొలిజన్ సిస్టమ్‌ను అమర్చారు. వీటితో పాటు ఆటోమేటిక్ డోర్లు, ప్రయాణికులు సులభంగా నడిచేందుకు వీలుగా బోగీల మధ్య పూర్తిగా మూసి ఉండే మార్గాలు, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో తిరిగే కుర్చీలు, ప్రతి సీటు వద్ద మొబైల్ ఛార్జింగ్ సాకెట్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్లు, సీసీటీవీ నిఘా వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయి.

ఇదిలా ఉండగా, ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని బెంగళూరు-బెళగావి మధ్య కొత్త వందే భారత్ రైలు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైలు ఎక్కి విద్యార్థులతో ముచ్చటించారు. దీంతో పాటు అమృత్‌సర్ - శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా, నాగ్‌పూర్ (అజ్నీ) - పుణె మధ్య మరో రెండు కొత్త వందే భారత్ సర్వీసులను కూడా ఆయన జెండా ఊపి వర్చువల్ గా ప్రారంభించారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమానికి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, వి. సోమన్న, ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

## ఎస్‌బీఐకి జాక్‌పాట్.. కోటి రూపాయల పెట్టుబడితో రూ.7,800 కోట్ల లాభం!

- ఎన్ఎస్‌డీఎల్‌లో పెట్టుబడితో ఎస్‌బీఐకి భారీ జాక్‌పాట్
- రూ.1.20 కోట్ల పెట్టుబడి విలువ రూ.7,801 కోట్లకు చేరిక
- కేవలం మూడు రోజుల్లోనే 6,50,000 శాతం రాబడి
- స్టాక్ మార్కెట్ లిస్టింగ్ తర్వాత షేరు ధరలో భారీ పెరుగుదల
- ఐడీబీఐ, ఎన్ఎస్ఈ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులకు కూడా భారీ లాభాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు ఊహించని జాక్‌పాట్ తగిలింది. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)లో పెట్టిన చిన్న పెట్టుబడి, ఇప్పుడు ఆ బ్యాంకుకు సిరుల పంట పండించింది. కేవలం రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన వాటా విలువ, స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన మూడంటే మూడు రోజుల్లోనే ఏకంగా రూ.7,801 కోట్లకు చేరడం సంచలనం సృష్టిస్తోంది. ఎన్ఎస్‌డీఎల్ కంపెనీ ఆగస్టు 8న స్టాక్ మార్కెట్‌లో అరంగేట్రం చేసింది. ఇష్యూ ధర రూ.800 కాగా, 10 శాతం ప్రీమియంతో రూ.880 వద్ద లిస్ట్ అయింది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడని ఈ షేరు, కేవలం 72 గంటల్లోనే రూ.1,300.30 స్థాయికి దూసుకెళ్లింది. దీంతో ఇష్యూ ధరతో పోలిస్తే 62.5 శాతం వృద్ధి నమోదైంది.

ఈ భారీ లాభాలతో అందరికంటే ఎక్కువగా లబ్ధి పొందింది ఎస్‌బీఐ. చాలా సంవత్సరాల క్రితం, ఎస్‌బీఐ కేవలం రూ.2 చొప్పున 60 లక్షల ఎన్ఎస్‌డీఎల్ షేర్లను కొనుగోలు చేసింది. దీని కోసం అయిన ఖర్చు కేవలం రూ.1.20 కోట్లు మాత్రమే. నేడు ఆ వాటా విలువ రూ.7,801.80 కోట్లకు పెరిగింది. అంటే, ఎస్‌బీఐకి కాగితాలపైనే (పేపర్ ప్రాఫిట్) రూ.7,800.60 కోట్ల లాభం వచ్చినట్టు. ఇది దాదాపు 6,50,050 శాతం రాబడి కావడం గమనార్హం. ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంకులు కూడా భారీ లాభాలను ఆర్జించాయి. ఐడీబీఐ బ్యాంక్ కూడా రూ.2 చొప్పున రూ.5.99 కోట్లతో కొన్న వాటా విలువ ఇప్పుడు రూ.3,898 కోట్లకు చేరింది. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఎస్‌యూయూటీఐ) రూ.2.04 కోట్లతో కొన్న షేర్ల విలువ రూ.1,332 కోట్లకు పెరిగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) రూ.12.28 చొప్పున పెట్టిన రూ.36.84 కోట్ల పెట్టుబడి, ఇప్పుడు 105 రెట్లు పెరిగి రూ.3,900 కోట్లకు చేరింది. అదేవిధంగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.150.54 కోట్ల పెట్టుబడిపై రూ.1,507 కోట్ల లాభం పొందగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2.66 కోట్ల పెట్టుబడిపై రూ.664 కోట్ల లాభాన్ని ఆర్జించింది. మొత్తంగా ఎన్ఎస్‌డీఎల్ లిస్టింగ్ దాని ప్రారంభ పెట్టుబడిదారులకు కనకవర్షం కురిపించింది.